


పిక్నిక్ స్పాట్‌లో పేకాట జోరుగా సాగుతున్నది.

ఆడాళ్లంతా ఒకవైపు మగాళ్లందరు మరోమూల కూర్చున్నారు.

యవ్వనమంతా కూడి సవ్వడిచేస్తున్నట్టు స్నేహబృందమంతా తెగ వాగుతున్నారు.

అన్నీ కొత్త జంటలే. అందరికీ మధ్యనున్నది ఫేమిలీ ఫ్రెండుషిప్పే. అందమయిన తమ అర్ధాంగులనందర్నీ మట్టిచెట్టు నీడలో పోగేసి, మగాళ్లంతా ఆడుతున్న పేకమీదొక్కన్ను, పోగయిన కోకలపై మరో కన్ను ఉంచి మరీ ఆనందిస్తున్నారు.

రంగురంగుల చీరలతో, పోగయిన అందంతో, భిన్నత్వంలో ఏకత్వాన్ని చూసి మరీ మురిసిపోతున్నారు.

నవ్వులతో నాల్గు దిక్కులూ పరవశించాయి.

ఆడాళ్లంతా కంపీలో ఛాంపియన్లయినట్లు మరీ సాగుతున్నదాట.

చాకుల్లాంటి జోకులతో పరిసరాలన్నీ పులకించాయి.

జోకులు చాకుల్లానే వాడిగా ఉన్నా ఆ సంతోష సమయంలో అందర్నీ అవి అమృతపు జల్లుల్లా తాకుతున్నాయి.

జోగారావు జోకులపుట్ట.

అతడు చలాకీగా వదిలే ఒక్కొక్క

జోకు దొక్కనెక్కడ పగలదీస్తుందో వని బెగులుతారంతా.

లెక్కబెట్టినట్టు డజనుమంది స్నేహితులు వాళ్లు. పెళ్లాలతో కలిపి రెండు డజన్లు. కొందరు క్లాస్మేట్లు మరికొందరు ఆఫీసు కోలీగులు. అంతా నాలుగు సంవత్సరాల అంతరంలో పెళ్లయిన వాళ్లే. అందర్లోనూ యవ్వనం నవ్వుతున్నది. ఏ ఒక్కరికో ఒకటి అర పిల్లలున్నారు తప్పితే అంతా 'అలక్ నిరంజనులే.'

జోగారావంటే ఆ బృందానికి అంతులేని అపేక్ష.

అతడు లేకుంటే అరనిమిషమన్నా ముందుకు సాగదు వాళ్లకు. వారి నడుమ గల సాన్నిహిత్యాని క్కారణం జోగారావు, అతడొదిలే జోకులేను.

కార్తీకమాసం తన ప్రత్యేకతను చాటుతున్నది. తోటలోని ప్రతి పువ్వు పలకరింపుగా నవ్వుతున్నది. ఆకులన్నీ వీస్తున్నగాలికి తమ పచ్చదనాన్ని పలువురిపై చిలకరించాలనే తాపత్రయంతో ఊగిసలాడుతున్నాయి. చూపరులను చూసి భయపడుతున్నాయనట్టు ఆకుల మాటున దాగినపళ్లు పొంచిపొంచి చూస్తున్నట్టున్నాయి. తయారయిన వంటకాల వాసన పరిసరాలను చుట్టుముట్టింది.

అరగంటకోమారు కాఫీ ఏర్పాటు, చైను స్మోకింగుకి తగ్గట్టు సిగరెట్ల పాకెట్లు, జోగారావు నోటినుండి జారి పడుతున్న విట్లు, (అన్యమనస్కంగా ఉండి) ఆట వెడగొట్టినవాడికి తగ్గట్టు తిట్లు వీటన్నిటిమధ్య మధ్యాహ్నం ఒంటిగంట వరకు పేకాట మహాజోరుగా సాగింది.

ఒక్కొక్కరు లేచి భోజనానికి కూర్చొనే ఏర్పాట్లు చేయసాగారు. ఆడాళ్లంతా ఒక వరసలోను మగాళ్లు మరో వరసలోను ఎదురెదురుగా కూర్చున్నారు. భర్తకెదురుగా కూర్చొని భార్య భోజనం చేయరాదన్న పురాతన సిద్ధాంతాన్ని వమ్ముచేయాలన్న తలంపుతో వేరు వరుసల్లోనయినా ఎవరి భార్య వారెదుటనే కూర్చునేందుకు ఏర్పాటు జరిగింది.

వంటలయ్య వడ్డన కానిచ్చాడు.

అంతా ఆనందంగా తృప్తిగా భోజనం ముగించారు.

సాయంత్రం వరకు తోటకు చుట్టుప్రక్కల చోట్లన్నీ చుట్టిముట్టి వచ్చారంతా. ఐదుగంటలకు అల్పమయిన ఫలహారాన్ని కానిచ్చి, కప్పు కాఫీచొప్పున లాగించి, వనభోజనాన్ని ముగించారు. ముగింపువాక్యాలు పలికేందుకు ముకుందరావుని ముందుకు తోశారు బృదమంతా.

నలుగురి ముందు నిటారుగా నిలబడి నాలుగుమాటలు పలకగల నేర్పు అక్కడి వాళ్లందర్లోకి ఒక్క ముకుందరావుకే ఉంది. ఇదివరలో స్కూల్లో జరిగిన తెలుగు యింగ్లీషు డిబేట్లలో మాట్లాడి ముకుందం మూడు థర్డ్ ప్రయిజులను కూడ గెలుచుకున్నాడు.

"డియర్ ఫ్రెండ్స్ అండ్ సిస్టర్స్! కార్తీక మాసంలో ఏదో ఒక రోజున స్నేహితులు బంధువులు ఆప్తులు అంతా కలిసిమెలిసి వనభోజనం పేరుతో రోజంతా చెట్లనీడల్లో పచ్చని మైదానంలో సరదాగా సంతోషంగా గడపడం మామూలే. ఈ మాసంలో వనభోజనం మనిషికి ముక్తిని ముదాన్ని కలిగిస్తుందంటారు. ఏది ఏమయినా నలుగురూ సన్నిహితంగా కలిసి తిరిగేందుకిదొక చక్కని అవకాశం. ఈనాటి పిక్నిక్‌తో మన మధ్య మరింత సాన్నిహిత్య మేర్పడింది. మన స్నేహానికి మరింత బలం చేకూరింది. ఈ శుభసమయంలో నాదొక చిన్న విన్నపం. ఈ రోజుల్లో దంపతులయినవారిద్దరూ సినిమాకో, షికారుకో ఎక్కడికి బయలుదేరినా ఒకే రంగు దుస్తులు వేసుకోవటం మనం చూస్తున్నాం. భార్య కట్టిన చీరకు నింంపై పువ్వులుంటే, వేసుకున్న బ్లౌజు, రిబ్బను, గాజులు, చివరకు బొట్టు, గోళ్ళ రంగు అన్నీ ఆ చీరరంగునే అనుకరించి ఉండటం, ఆమె భర్తవేసే దుస్తులు అదే రంగులో ఉండటం చూస్తున్నాం. అలాంటి జంట ఎవరికన్నా ముచ్చట కలిగిస్తుంది. అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. అలా అలంకరించుకోవటం వారి అన్యోన్యతకు చేరికకి చిహ్నంగా కనబడుతుంది. ఒకే రంగులో ఆలుమగ లిరువురు బంధింపబడినంత తృప్తి. ఒకే ఆచ్ఛాదనతో దంపతులిద్దరు కప్పబడినంత ఆనందం. క్షీరనీరా లేకమయినంత హాయి. అదే తీరులో నాదో చిన్న అభిప్రాయం. మన స్నేహం ఎల్లకాలం ఒకేరంగుతో నిలవాలన్న కోరిక. నిన్ననేం జరిగిందంటే, మా శ్రీమతికి చీర కొనేందుకని దిల్‌దార్ క్లాత్ సెంటర్ కెళ్లాను. ఫారెన్ నైలెక్స్‌లో ఎక్సెలెంట్ ప్రింటొకటి చూపించాడు. చీరలు చూస్తున్న నాలో ఒక అమోఘమయిన ఆలోచన లేచింది. ఇద్దరు స్నేహితులు ఒకే రకమయిన డ్రెస్ వేసుకుంటే అన్నదమ్ముల్లా అగపడతారు. యూనిఫారంలో అంతటి మహత్తున్నది. వచ్చేదే కార్తీక మాసపు చివరి సోమవారం. ఆనాడు మన బృందమంతా ఒకే రంగు దుస్తుల్లో శివదర్శనం చేసుకుంటే మన స్నేహం ఎప్పటికీ రంగులు మారదని నాకొక నమ్మక మేర్పడింది. దుకాణంలో చూశాను గదా, లెక్కబెట్టినట్టు అదీ ప్రత్యేకంగా మనకోసమే నన్నట్టు ఒకే రంగులో డజను చీరలే ఉన్నాయి. మాచింగు రంగులో షర్టింగులు పేంటింగులు సుపీరియర్ క్వాలిటీలో దొరుకుతున్నాయి. చీర ఖరీదు చాలా చవక. రెండు వందల యాభయ్యట. ఒక్కొక్క జత బట్టలకు నాలుగు వందలకు మించిపోదు. మా ఆఫీసరుగారి భార్యా అలాంటి చీరనే నాలుగువందలిచ్చి తెప్పించింది కలకత్తానుండి. ఐతే




యిక్కడ రిబేటు మూలంగా మనకు చవగ్గా వస్తున్నాయి. మనమంతా ఒకే మాదిరి బట్టల్లో చివరి సోమవారంనాడు శివాలయంలో అడుగుపెడదామని నా మనస్సువ్విళ్లూరుతున్నది. నా కోరిక సరియయినది కాదనిపిస్తే మన్నించండి ఫ్రెండ్స్. మన స్నేహాన్ని మరింత దృఢపరచాలని కోరుకోవడం స్నేహితుని నా ధర్మం. అటుపై మీయిష్టం." అన్నాడు ముకుందరావు.

చీరల మాట విన్న నారీమణులంతా గంగవెర్రులెత్తారు. ఫారెను చీరలంటే అందరికీ మోజే. అసలు, ఫారెను సరుకంటేనే బాగుంటుం దనుకోవటంలో గ్యారంటీ ఉంటుంది. ఆలోచనల్లోపడ్డ మగాళ్లని నిలబడనీయలేదా ఆడవాళ్లు

అందరికీ ఎట్లాగూ సి.డి. రిఫండందుతుంది. పట్టుబట్టి బిల్లు చేయించుకుంటే రెండ్రోజుల్లో డబ్బందక మానదు. ఆ డబ్బు నింటికి రానివ్వకుండా చేస్తేసరి, అనుకున్నారాడాళ్లు.

ముకుందరావు సూచనతో ఏకీభవించక తప్పలేదా మగాళ్లకి.

మూడురోజు లనంతరం అందరికి సి.డి. డబ్బు అందింది. ఆనాటి సాయంత్రం, డబ్బందటమే ఆలస్యమన్నట్టు ఒక్కొక్కరూ పావుగంట అరగంట వ్యవధిలో ముకుందరావింటికి చేరారు. అందరికీ కమ్మని కాఫీపోసి మర్యాద చేశాడు ముకుందం. స్నేహితు

లంతా ఒక్కటయి దిల్‌దార్ క్లాత్ సెంటర్లో అడుగుపెట్టారు.

కాంతులు వెదజల్లుతున్న లైట్ల వెలుగులో ఫారెన్ టెక్సు ఎక్సలెంటుగానే కనిపించింది. బ్రహ్మాండంగా సూటయిన పేంటింగులు షర్టింగులు కూడ దొరికాయి ఒక్కొక్కరి బిల్లు ఏడు వందలకెళ్లింది. ఐనా వారి స్నేహమ్ముందదెంతని? తన పెళ్లాం ఫారెన్‌ది కాదు. కనీసం ఫారెన్ రిటర్న్డు కూడ కాదు. మగాడికి పైకి చెప్పుకోలేకపోయినా, ఫారిన్ ఆడదంటే ఒక రకమయిన మోజు. ఫారిన్ చీరలో ప్రత్యక్షమయిన తన పెళ్లాం అప్పుడే ఫారెన్ నుండి దిగిందనుకుంటే కొంత హాయి. అందుకు ఫారెన్‌చీర కొనితీరాలని తీర్మానించుకున్నారు కొందరు మగవారు. మరి కొందరి వద్ద విదేశీచీరలు ఒకటి అరా ఉన్నా, అక్కర్లేదనే ఆడాళ్ల మాత్రం అరుదు. పైగా స్నేహబృందం తీర్మానించిన దాన్ని తీసిపారేయలేరుగా!

ఒక్కొక్కరు తలో పేకెట్టుతో యిళ్లకు మళ్లారు.

ముకుందరావు భార్య చీరను చూసి మురిసిపోయింది. బ్లౌజుపీసు, పేంటింగు, షర్టింగు బట్టలు అన్నీ ఎంతో బాగున్నాయని మెచ్చుకుంది.

“ఇంతకూ ఈ చీరెంతండీ?” అడిగిందామె, దాన్ని ఒంటికి చుట్టుకుంటూ.

“ఎంతేమిటి? పదికి ఒకటి ఫ్రీ.”

“అంటే?” కుతూహలంగా చూసింది.

“అంటే గింటే మరేంటే ముద్దూ! నా ద్వారా పది పీసులమ్ముడయినట్లయితే కమీషను క్రింద నాకొక పీసు ఫ్రీగా యిస్తాడన్నమాట. నా ద్వారా పదకొండు పీసులమ్ముడయ్యాయి. ఈ చీర, పేంటింగు, షర్టింగు, బ్లౌజుపీసు అన్నీ మనకు కమీషను మీద వచ్చినవే. తెలిసిందా? ఐతే ఎవరడిగినా మొత్తం ఏడు వందలని చెప్పు. చీర ఖరీదు రెండు వందల యాభయ్యని చెప్పడం కూడ మర్చిపోకు” అంటూ జేబులోని చెక్కుచెదరని సి.డి. డబ్బుని భార్యకందించాడు ముకుందరావు.

స్నేహ ధర్మాన్ని యింత చక్కగా నిర్వర్తించిన మొగుణ్ణి చూసి మరింత మురిసిపోయింది మిసెస్ ముకుందం.